క్లుప్తంగా

తరుణీ తరంగాలు ఫెస్ట్‌లో మండపేట విద్యార్థినులు



కోలాటం విభాగంలో తృతీయస్థానం సాధించిన శిరీష బృందం

మండపేట: విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన తరుణీ తరంగాలు 5వ మహిళ ఫెస్ట్‌లో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పలు సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థినులు, సిబ్బందికి ఈ వేడుకలు నిర్వహించారన్నారు. కోలాటం విభాగంలో అబ్బిరెడ్డి శిరీష బృందం రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించగా, ఏకపాత్రాభినయం విభాగంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఎస్ ఎల్ సుధారాణి ద్వితీయ స్థానం దక్కించుకున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు, సిబ్బందిని శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు.

మండపేటలో ప్రత్యేక పారిశుధ్య పనులు



దోమల నిర్మూలన మందు పిచికారీ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య

మండపేట: పట్టణంలో దోమల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల బెడద అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 1వ వార్డు కౌన్సిలర్, విప్ పోతంశెట్టి ప్రసాద్ కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రెండు రోజులుగా వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య శుక్రవారం డ్రైన్లలో ఆయిల్‌బాల్స్, దోమల నిర్మూలన యాంటీ లార్వా మందులను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైన్లలో చెత్త వేయవద్దన్నారు. తడి పొడిచెత్తగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

బీజేపీని పటిష్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు

కె.గంగవరం: గ్రామ స్థాయి నుంచి బూత్ కమిటీలు ఏర్పాటు చేసి తద్వారా పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కోటిపల్లిలో శుక్రవారం మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఏపీలో పార్టీ విజయం దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోని పార్టీ శ్రేణులు తీసుకువెళ్లాలని కోరారు. పార్టీ నాయకులు అయినవిల్లి సత్తిబాబు గౌడ్, గుర్రాల సత్యనారాయణ, చొల్లంగి బంగారం, కోడూరి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు మేలు జరిగేలా చూడాలని ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని రైతులంతా పంట నమోదు, ఈ–కేవైసీ పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. రానున్న వారంలో సామూహిక ఎలుకల నివాణకు ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పంటలకు అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

వరిలో కలుపు ఉధృతం

- పెరుగుతున్న పెట్టుబడులు
- పంటకు తెగుళ్ల బెడద
- రైతన్నల ఆందోళన



కాజులూరులో వరి పైరులో పెరుగుతున్న కలుపు మొక్కలు

కాజులూరు: రబీలో కలుపు తీవ్రత రైతన్నలను కలవరపెడుతుంది. దీంతో సాగు కొనసాగించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నియోజకవర్గ గ్రామాల్లోని వరి పొలాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉండటంతో ప్రస్తుతం సాగునీటి ఎద్దడి ఏర్పడింది. మెరక పొలాలకు నీరందక రైతులు కాలువల నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని వంతుల వారీ విధానంతో పొలాలకు మళ్లించి సాగు చేస్తున్నారు. తరచూ సాగునీటి ఎద్దడి ఏర్పడటంతోనే వరి పొలాల్లో కలుపు తీవ్రత అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక శాతం పొలాల్లో వెదజల్లు విధానం అవలంబించటం కలుపు తీవ్రతకు మరో కారణమని రైతులు అంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండల గ్రామాల్లో సుమారు 56 వేల ఎకరాల్లో ఈ ఏడాది రబీలో రైతులు వరిసాగు చేపట్టారు. ఇందులో సుమారు 85 శాతం రైతులు వెదజల్లు విధానాన్ని అవలంబించారు. సాధారణ సాగులో రైతులు కొంత పొలంలో నారుపోసి, మొక్క ఎదిగిన తర్వాత నారుతీసి నాట్లు వేస్తుంటారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదజల్లు విధానంలో పొలాన్ని చదును చేసి వరి విత్తనాలను నేరుగా పొలంలో చల్లుతుంటారు. ఈ విధానంలో వరి మొక్కతో పాటు కలుపు మొక్కలు సమాంతరంగా పెరుగుతుంటాయి. మార్కెట్‌లో వరి మొక్కకు నష్టం కలగకుండా కలుపు మొక్కలను నిర్మూలించే కలుపు మందులు లభిస్తున్నప్పటికీ అవి ఖరీదైనవి కావటంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా సన్న, చిన్నకారు రైతులు ఆ మందులను కొనుగోలు చేసి వినియోగించలేక కలుపు తీవ్రతను ఎదుర్కొంటున్నారు. నీటి ఎద్దడి తలెత్తి పొలాల్లో ఆరుతడి తగ్గి చేను బురద పదునుకి చేరినప్పుడు కలుపు మొక్కలు విస్తృతంగా పెరుగుతుంటాయి. వరి పంటలకు వేసే ఎరువులను తీసుకుని వరి మొక్కలను అధిగమించి పెరుగుతుంటాయి. ప్రస్తుతం మండల గ్రామాల్లో వరి పంట వేరు నాటే దశ నుంచి దుబ్బు కట్టే దశలో ఉన్నాయి. కలుపు తీవ్రత ఇబ్బందికరంగా మారిందని ఈ పరిస్థితిలో కలుపు నివారణకు రసాయన మందులు పిచికారీ చేసిన ఫలితం ఉండదని తప్పనిసరిగా కూలీలతో కలుపు మొక్కలు తీయించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పంటలపై ఉధృతమవుతున్న తెగుళ్లతో పాటుగా, కలుపు నివారణకు మందులు వాడటం మూలంగా రబీలో ఖర్చులు అధికమయ్యే విధంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

అధిక ఖర్చవుతోంది



ప్రస్తుతం రబీలో సాగు నీటికి మొదటి నుంచి అధిక ఖర్చవుతుంది. దీనికి తోడు తెగుళ్ల దాడి చేయటంతో పాటుగా చేలల్లో కలుపు పెరగటం ఆందోళన కలిగిస్తుంది. వాటి నివారణకు మందులు వాడటం మూలంగా పెట్టుబడులు పెరిగిపోతుంది.

– మేడిశెట్టి గణపతి, రైతు, కాజులూరు

జాగ్రత్తలు పాటించాలి



కలుపు నివారణకు మందులు పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎంపిక చేసిన మందులను మాత్రమే వినియోగించాలి. కలుపు రకాలను బట్టి వ్యవసాయాధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలి.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

దాళ్వాకు ఎరువుల కొరత లేదు

కాజులూరు: మండల గ్రామాల్లో రైతులకు ఎరువుల కొరత ఏ మాత్రం లేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి దాళ్వా సాగులో వివిధ దశల ద్వారా నాలుగువేల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ తదితర ఎరువులు అవసరమవుతుందన్నారు. ఇందులో రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రెండువేల మెట్రిక్ టన్నులు వ్యవసాయశాఖ సరఫరా చేస్తుందన్నారు. మూడు దఫాలకు గానూ రెండు దఫాలకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేల ద్వారా రైతులకు సరఫరా చేశామన్నారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన ఆర్‌బీకేలలో కాని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో కానీ ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

స్వచ్ఛ శలపాకకు కృషి

కాజులూరు: మండలంలోని శలపాక గ్రామంలో పారిశుధ్యం పనులు సమర్థవంతంగా నిర్వహించి స్వచ్ఛ శలపాకకు కృషి చేస్తున్నామని సర్పంచ్ పోతుల గనిరాజు అన్నారు. శుక్రవారం సచివాలయ పారిశుధ్య సిబ్బందితో కలసి సర్పంచ్ గనిరాజు వీధులను శుభ్రం చేసి డ్రైనేజీల్లో దోమల నిర్మూలనకు ఎబేట్ మందును పిచికారీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామం పొలాల మధ్యలో ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. అయితే శలపాక మైనర్ పంచాయతీ కావడంతో పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్నారని దీంతో తాను స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తూ సిబ్బందికి సహకరిస్తున్నానన్నారు.

నేటి నుంచి 20 వరకూ జాగృతి ఉద్యమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు అహ్మద్, సభ్యులు

రాయవరం: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఈ నెల 20వరకూ నిర్వహించే జాగృతి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని జమాతే ఇస్లామీ హింద్ రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు జునాబ్ ఫరీద్ అహ్మద్ కోరారు. మానవత–నైతికత అనే అంశంపై ముద్రించిన కరపత్రాలను మండలంలోని చెల్లూరు మసీదు వద్ద శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జునాబ్ ఫరీద్ అహ్మద్ మాట్లాడుతూ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 'మానవత–నైతికత' నినాదంతో రాష్ట్ర వ్యాప్త జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనిషి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నప్పటికీ మానవతా విలువలు నానాటికీ దిగజారిపోతున్నాయన్నారు. సమాజం నిత్యం అశాంతి, అలజడులకు గురవుతోందన్నారు. నేడు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలని పేర్కొన్నారు. సమాజంలో నైతిక విలువలను పెంపొందించాలనే లక్ష్యంతో జమాతే ఇస్లామి హింద్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా మానవత నైతికత జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందుగా వారు మసీదులో పవిత్ర నమాజ్‌ను చదివారు.

అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి



అంగరలో సాగు సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణమూర్తి

కపిలేశ్వరపురం: వ్యవసాయం, పశుపోషణలపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల క్షేత్ర స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని అంగర రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సాగు సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రబీ పంట నమోదుకై రైతు ఈకేవైసీ, పీఎం కిసాన్ 13వ విడత లబ్ధి, ఎలుకల మందు పంపిణీ తదితర అంశాలపై కార్యాచరణను వివరించారు. మండల పశువైద్యాధికారి పి.ఇందు మాట్లాడుతూ పాడి రైతులకు బ్యాంకు ద్వారా పశు రుణాలు మంజూరు ప్రక్రియ గురించి వివరించారు. కార్యక్రమంలో సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, నక్కా సింహాచలం, వింటి దుర్గారావు, కె.దుర్గా ఖండేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలు అందజేత



రామచంద్రపురం రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని రూరల్, పట్టణ పరిధిలో కొత్తగా ఎంపికై న అంగన్‌వాడీ ఆయాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. రూరల్‌లోని ద్రాక్షారామ అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంపికైన రాయుడు లక్ష్మీప్రసన్న, అబ్బాసీ, పట్టణ పరిధిలో పెంకే లక్ష్మీకుమారి నియామక పత్రాలు అందుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఓర్పు, సహనంతో విధులు నిర్వహించాలని, సీఎం జగన్ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను సక్రమంగా వారికి అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, సాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్, ద్రాక్షారామ ఎంపీటీసీ నున్న సత్యవతి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పట్టణ 6 వ వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.అమ్మాజీ, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో గ్రావెల్ మాఫియా

- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న పొక్లెయిన్

మండపేట: మండలంలోని ద్వారపూడిలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. నిబంధనలు తుంగలోకి తొక్కి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తోంది. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని వేములపల్లి శివారు 105 సర్వే నంబర్ ప్రాంతంలోని ఏ విధమైన అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో రైతులకు చెందిన దాదాపు 33 ఎకరాల్లో స్థల లెవెలింగ్ కోసం గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. వాటి సమీపంలో మూడు ఎకరాల్లో తవ్వకాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. నర్సరీల్లో మొక్కల పెంపకానికి, రోడ్డు పక్కల బెర్మ్‌లకు వినియోగించే విలువైన పూస గ్రావెల్, ఎర్రమట్టి ఈ భూముల్లో దొరుకుతుండడంతో అక్రమ తవ్వకాలు జోరుగా సాగిపోతున్నాయి. అధికారులకు దొరక్కుండా ఉండేందుకు రాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తున్నట్టు స్థానికులు అంటున్నారు. పదుల సంఖ్యలో లారీలు తెల్లవార్లూ తిరుగుతున్నాయన్నారు. ఒక రోజు రాత్రికి దాదాపు రూ.మూడు లక్షలు విలువైన గ్రావెల్ తరలిపోతున్నట్టు అంచనా. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రావెల్ తవ్వకాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ టి.రాజేశ్వరరావును సంప్రదించగా క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు గ్రామ శివారు సుభద్రాపురానికి చెందిన వృద్ధురాలు పాలచర్ల లక్ష్మి మెడలోని రూ.లక్షా 20 వేల విలువైన 60 గ్రాముల బంగారు గొలుసును దుండగుడు అపహరించుకుపోయాడు. లక్ష్మి గురువారం సుభద్రాపురంలోని తన ఇంటిలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన పెన్షన్ పుస్తకాన్ని ఇవ్వమని అడిగాడని బాధిత వృద్ధురాలు లక్ష్మి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పుస్తకాన్ని ఇస్తుండగా తన మెడలోని గొలుసును బలవంతంగా లాక్కొని మోటారు బైక్‌పై పరారయ్యాడంటూ అదే రోజు పోలీసులకు లక్ష్మి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంటి శుక్రవారం తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కపిలేశ్వరపురం: యువతి అదృశ్యంపై అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై చంటి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం... రాయవరం మండలం వెదురుపాకకు చెందిన ఇంజమళ్ళ వీర్రాజు తన 23 ఏళ్ళ కుమార్తె అనూష కనిపించడం లేదంటూ గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై అంగర పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అమ్మమ్మను చూసేందుకు తన కుమార్తె అనూష ఈ నెల 7న హైదరాబాద్ నుంచి పడమరఖండ్రిక అమ్మమ్మ ఇంటికి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనూష కనిపించడం లేదంటూ 8వ తేదీన తన బంధువులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. బంధువులు, సమీప ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం: పనికి వెళ్లకుండా బాధ్యత లేకుండా ఉంటున్నాడని ఇంట్లో వాళ్లు మందలించడంతో మనస్థాపం చెంది చీమల మందు తాగిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రామచంద్రపురం ఎస్సై సురేష్ బాబు విలేకరులకు తెలిపారు. పట్టణంలోని చప్పిడి వారి సావరానికి చెందిన దుబాసి లోవరాజు(39)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 8న చీమల మందు తాగగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఏఎస్సై రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది

రామచంద్రపురం: సుమారు వందేళ్ల తరువాత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు వివాదాల్లేని భూ హక్కును కల్పించాలన్న సదుద్దేశంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సమగ్ర భూసర్వే త్వరలో పట్టణంలో ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. సర్వేకు పట్టణ ప్రజలు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సీడీఎంఎ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు సర్వే విధి విధానాలపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీని రద్దు చేస్తూ ఉత్తర్వులు

యానాం: యానాంలో కొలువైన శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీని తాత్కాలికంగా రద్దు చేస్తూ శుక్రవారం మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. 18 ఏళ్లుగా కమిటీ పాలకవర్గంలో వేరొకరికి అవకాశం ఇవ్వకుండా ఒకే కమిటీ ఉండటంతో స్థానికులు కొందరు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ చేసి ప్రస్తుత కమిటీని తాత్కాలికంగా రద్దుచేసి దేవస్థానం పూర్తి బాధ్యతలు, ఆలయ పనులను సైతం పుదుచ్చేరి హిందూ రిలీజియస్ ఇనిస్టిట్యూట్, ఎండోమెంట్ శాఖ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు నాయకులు పెసల వెంకటేష్, హరిప్రసాద్ తెలిపారు.

జగన్ పాలనలో విద్యకు ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రాయవరం ప్రభుత్వ హైస్కూల్లో జూనియర్ కళాశాల ప్రారంభం



ఎమ్మెల్సీ త్రిమూర్తులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి, అధ్యాపకులు

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, విద్యను కూడా ఆస్తిగా భావించి, అభివృద్ధి చేస్తున్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వ హైస్కూల్లోకి మార్చాలంటూ కొన్నేళ్లుగా విద్యార్థులు, తల్లిదండ్రులు చేస్తున్న డిమాండ్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగానే వెంటనే ఆమోదముద్ర వేశారన్నారు. అనపర్తి, మండపేట నియోజకవర్గాల పరిధిలోని 11 గ్రామాల విద్యార్థులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంటర్ బోర్డు డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులు చేరేలా గ్రామాభివృద్ధి కమిటీ కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తేతల సుబ్బరామారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ త్రిమూర్తులు కళాశాలను మార్చడం ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. సమావేశంలో హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ దారపు వీరవెంకట నాగేశ్వరరెడ్డి, పారిశ్రామికవేత్త చింతా పాండురంగారెడ్డి, న్యాయవాది తాడి రామచంద్రారెడ్డి తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులను కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిన్నం అపర్ణా పుల్లేష్, ఎంపీటీసీ గంటి రోజా, కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సోమేశ్వరంలో మహా రుద్రయాగం

- 12 రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ



మహా రుద్రయాగానికి హోమ గుండం సిద్ధం

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకూ 12 రోజుల పాటు ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది.ఈ గ్రామంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాయతన మహారుద్ర యాగం నిర్వహిస్తారు. సరిగ్గా 22 ఏళ్ల క్రితం ఫిబ్రవరి 12న ప్రారంభమైన పంచాయతన మహా రుద్రయాగాన్ని మరోసారి అదే తేదీన ఆ గ్రామంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను మహారుద్రయాగ కమిటీ పూర్తి చేసింది. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వింజమూరి శ్రీరామసుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, బ్రహ్మశ్రీ కందర్ప కామేశ్వరశర్మ, వింజమూరి వీరభద్రం, పెద్దింటి శేషాచార్యుల సమక్షంలో రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాలు నిర్వహిస్తారు. 12న ఉదయం 7.45 గంటలకు గణపతి పూజతో మహా రుద్రయాగం ప్రారంభం కానుంది. ఈ 12 రోజులూ ఉదయం తొమ్మిది గంటలకు మహన్యాస పూర్వక రుద్ర జపాభిషేకములు, సూర్య నమస్కారములు, సూర్య మంత్రానుష్టానం, చండీ సప్తశతీ పారాయణం, మంత్రానుష్టానం, గణపతి, విష్ణు మంత్రానుష్టానాలు, అర్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు చండీ సప్త శతీ హోమం, సాయంత్రం నాలుగు గంటలకు రుద్ర తర్పణం, రుద్ర హోమం, గణపతి చతురావృత్తి తర్పణం, గణపతి హోమం, మహా సౌర అరుణ మం, విష్ణు హోమం, బలిహరణ, బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహిస్తారు. రాత్రి ఏడు గంటలకు నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి దర్బార్ సేవ, ప్రసాద వితరణ చేస్తారు. మహా రుద్రయాగం పూర్తయిన మరుసటి రోజు ఈ నెల 24న భారీ అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.

బ్లాక్‌మెయిలర్లకు భయపడొద్దు

- ఎవరైనా బెదిరిస్తే నా దృష్టికి తీసుకురండి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: బ్లాక్ మెయిలర్లకు భయపడి ఎవరికీ డబ్బులు ఇవ్వ వద్దని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఎవరైనా బ్లాక్ మెయిలింగ్ చేస్తే తన దృష్టికి తీసుకువస్తే అలాంటి వారి ఆట కట్టిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న తమను ఇరువురు వ్యక్తులు డబ్బులు కోసం సమాచార హక్కు చట్టం పేరిట బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నారంటూ పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంపై శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడారు. విలువైన సమాచార హక్కు చట్టాన్ని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా విష సంస్కృతితో మండపేట ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గత పాలకులు ఇటువంటి అక్రమాలపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి బ్లాక్‌మెయిలర్లను ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వంతో పనిచేయించుకునే హక్కు ప్రజలకుందని, నిబంధనలు మేరకు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడం ద్వారా ఇటువంటి వారికి అడ్డుకట్ట వేయవచ్చునని ఎమ్మెల్సీ తోట సూచించారు. ప్రజలను ఎవరైనా బ్లాక్ మెయిలింగ్ చేస్తే తాను ఉపేక్షించేది లేదని, తన దృష్టికి తీసుకువస్తే బాధితులకు అండగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు.

వైభవం.. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ముమ్మిడివరం: కర్రివానిరేవులో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన శ్రీవిజయదుర్గమ్మ వారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ కాళ్లకూరి కామేశ్వరశర్మ మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీ కోలా గంగాభవానీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి, మల్లాడి సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తాళ్లరేవు: పోలేకుర్రులో కోదండ రామస్వామివారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుడు ఏలూరిపాటి ప్రభాకర శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన్, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, హోమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోలేకుర్రుకు చెందిన పోతుల సత్యనారాయణమ్మ, దివంగత లత్సయ్య కుమారులచే ఆయా పూజలు జరిగాయి. శనివారం ఉదయం 8.43 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్న అన్నసమారాధన ఉంటుందని పోలేకుర్రు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు.